నేటి కందం- నేటికి అందం



లతెంపరి టారిఫ్ఫులతో
నింపాదిగ బడుగులపయి నిప్పులు గురిసే
ట్రంపుకు గుణపాఠము నిడ
దింపెను మోడీ ప్రపంచ దిగ్గజతతులన్ !!

(టారిఫ్ ల నేపథ్యంలో ట్రంపు ఆట కట్టించ దానికి మోడీ చైనా వెళ్లి మిత్రులను పెంచుకొని విజయం సాధించి భారతదేశానికి దిగ్విజయంతో వస్తున్నారు)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


చురక

కాళేశ్వరం కమిషన్
కడకు చేరె సీబీఐకి
తేల్చేందుకు రాజకీయ
తెగనిముడే ఇకపైకి
దోషులంత కేంద్రంతో
దోస్తి చేస్తే ఇకచాలు
అవినీతి తప్పుపనులు
అన్ని స్వచ్ఛమై తేలు



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ బుధవారం 3-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:27 పేజీలు:6 వెల: రూ.1/-


## మైసూరులోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:కర్ణాటక, మైసూరులోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్(ఏఐఐఎస్‌హెచ్) వజ్రోత్సవ వేడుకల్లో గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము నిన్న హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గహ్లోత్, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ సిద్ధ రామయ్య, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్, కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దినేష్ గుండు రావు, మైసూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీమతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ “విద్య, వైద్యం, స్పీచ్, హియరింగ్ రంగాల్లో పరిశోధనల్లో గణనీయమైన కృషి చేసిన ఈ ప్రతిష్టాత్మక సంస్థ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనటం నాకు చాలా ఆనందంగా ఉంది. సంప్రదింపుల్లో లోపాలను గుర్తించటం, చికిత్స అందించటంలో కీలక సేవలందించిన సంస్థ మాజీ, ప్రస్తుత డైరెక్టర్లు, అధ్యాపకులు, నిర్వాహకులు, విద్యార్థులందరికీ ఈ ప్రత్యేక సందర్భంలో, నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను” అని తెలిపారు.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధీనంలో స్వయం ప్రతిపత్తి సంస్థగా 1965లో ఏఐఐఎస్‌హెచ్ స్థాపించారు. కమ్యూనికేషన్ లోపాలకు సంబంధించి మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్య సేవలు, శిక్షణ, పరిశోధన, ప్రజా విద్య, విస్తరణ సేవల్లో దక్షిణాసియాలోనే ఇది ప్రముఖమైన సంస్థగా పేరొందింది. కమ్యూనికేషన్ లోపంతో బాధపడే వారికి సంరక్షణ, పునరావాసం కల్పించటవే లక్ష్యంగా ఏఐఐఎస్‌హెచ్‌ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ డిప్లొమా, గ్రాడ్యుయేట్, పోస్ట్-గ్రాడ్యుయేట్, డాక్టోరల్, పోస్ట్-డాక్టోరల్ ఫెలోషిప్ కోర్సులను అందించడవే కాకుండా, కమ్యూనికేషన్, వినికిడి లోపాలున్న వారికి చికిత్స అందించి, వారిని సంరక్షిస్తుంది. పునరావాసం ద్వారా రోగులు, వారి కుటుంబ సభ్యులకు కూడా సహాయం చేస్తుంది. ఆగ్నేయాసియా ప్రాంతంలో, ఏఐఐఎస్‌హెచ్ తన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తింపు పొందింది.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి వి. హెకలి జిమోమి, భారత ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, ఏఐఐఎస్‌హెచ్ అధ్యాపకులు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్

హైదరాబాద్ సెప్టెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్టీ అధికారికంగా బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టీ రవీందర్ రావు, పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు సోమ భరత్‌ప్రకటన విడుదల చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘన కింద పార్టీ నుండి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సస్పెండ్ చేశారు. ప్రస్తుతం కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.ఎమ్మెల్సీ కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.కవిత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. పార్టీ లైన్ దాటి కవిత పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కేసీఆర్ వెంట దెయ్యాలు ఉన్నారని గతంలో ఆమె వ్యాఖ్యానించారు. ఆ తర్వాత మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై కూడా బహిరంగ విమర్శలు చేశారు. తాజాగా కాళేశ్వరం రిపోర్టుపై స్పందిస్తూ.. హరీశ్‌రావు, సంతోష్ రావుపై ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. కవిత వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కవితను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## తొలి మేడిన్ చిప్ ‘విక్రమ్ 3201’ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:సమికాన్ ఇండియా-2025 సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వదేశీ సెమీకండక్టర్ ‘విక్రమ్ 3201’ని పరిచయం చేశారు. భారత్ సెమీకండక్టర్ స్వావలంబన దిశగా దాన్ని చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. ఈ ప్రాసెసర్‌ను ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), చండీగఢ్ ఆధారిత సెమీకండక్టర్ లాబొరేటరీ సహకారంతో అభివృద్ధి చేశారు. ఇది 32-బిట్ మైక్రోప్రాసెసర్ కాగా.. ఇది అంతరిక్ష కార్యకలాపాలు, కఠినమైన పరిస్థితుల్లో పనిచేయడానికి ప్రత్యేకంగా రూపొందించారు. -55 డిగ్రీల సెల్సియస్ నుంచి +125 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకోగల సామర్థ్యం ఉన్నది.



రాకెట్లు, లాంచ్ వెహికల్స్‌లో నావిగేషన్, నియంత్రణ, మిషన్ నిర్వహణ పనులను నిర్వహిస్తుంది. రేడియేషన్, వైబ్రేషన్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఇది పని చేస్తూనే ఉండేలా దీన్ని సైనిక గ్రేడ్ ప్రమాణాల ప్రకారం రూపొందించారు. గతంలో ఇస్రో 2009 నుంచి ‘విక్రమ్ 1601’ (16-బిట్ ప్రాసెసర్)ను ఉపయోగిస్తోంది. ఇప్పుడు ‘విక్రమ్ 3201’ 32-బిట్ ఆర్కిటెక్చర్‌ను తీసుకురావడమే కాకుండా 64 బిట్ ఫ్లోటింగ్-పాయింట్ ఆపరేషన్స్ అడా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ సపోర్ట్, మెరుగైన కమ్యూనికేషన్ కోసం ఆన్-చిప్ 1553బి బస్ ఇంటర్‌ఫేస్ వంటి అనేక ప్రధాన అప్‌గ్రేడ్స్‌ను కలిగి ఉన్నది. ఇది ఎస్‌సీఎల్ చండీగఢ్ యూనిట్‌లో 180-నానోమీటర్ సిఎంఒఎస్ టెక్నాలజీని ఉపయోగించి తయారు చేశారు. విక్రమ్ 3201 ఇప్పటికే PSLV-C60 మిషన్‌లోనూ పరీక్షించారు. ఇది PSLV ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (POEM-4) మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ విజయం తర్వాత ఇస్రో రాబోయే లాంచింగ్ వెహికిల్స్ లో విస్తృతంగా వినియోగించబోతున్నది.

ఇస్రో ఈ ఏడాది మార్చిలో విక్రమ్ 3201తో పాటు కల్పన 3201 అనే మరో ప్రాసెసర్‌ను కూడా ప్రారంభించింది. ఇది 32-బిట్ SPARC V8 RISC ఆర్కిటెక్చర్‌పై ఆధారపడి పని చేస్తుంది. ఓపెన్-సోర్స్ టూల్‌చెయిన్‌కు సపోర్ట్ ఇస్తుంది. ఇస్రో మరో నాలుగు స్వదేశీ ఎలక్ట్రానిక్ డివైజ్‌లను ప్రవేశపెట్టింది. ఇందులో రెండు రీకాన్ఫిగరబుల్ డేటా అక్విజిషన్ సిస్టమ్స్, రిలే డ్రైవర్ ఎఅ, మల్టీ-ఛానల్ లో డ్రాప్-అవుట్ రెగ్యులేటర్ ఐసి ఉన్నాయి. ఈ పరికరాలన్నీ భారతదేశం దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గిస్తాయి. విక్రమ్ 3201తో భారతదేశం సెమీకండక్టర్ల రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. ఇది సరఫరా గొలుసు అడ్డంకులు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఇస్రో ఇందుకు పూర్తి సాఫ్ట్‌వేర్ పర్యావరణ వ్యవస్థను కూడా అభివృద్ధి చేసింది. ఇందులో ఏడిఏ కంపైలర్లు, అసెంబ్లర్లు, లింకర్లు, సిమ్యులేటర్లు ఉన్నాయి.

## సూడాన్ లో పెను విషాదం.. కొండచరియలు విరిగిపడి నేలమట్టమైన గ్రామం

**- వెయ్యి మందికిపైగా మృతి మృతుల్లో పురుషులు, మహిళలు, చిన్నారులు**



సూడాన్ సెప్టెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అంతర్గత కలహాతో అట్టుడుకుతున్న ఆఫ్రికా దేశం సూడాన్ లో పెను విషాదం చోటుచేసుకున్నది. పశ్చిమ సూడాన్‌లోని మర్రా పర్వత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వెయ్యి మందికిపైగా మరణించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వానలతో ఆగస్టు 31న కొండ చరియలు విరిగిపడ్డాయని సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్/ఆర్మీ వెల్లడించింది. ఈ దుర్ఘటనలో ఓ గ్రామం పూర్తిగా నేలమట్టమైందని, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని తెలిపింది.పశ్చిమ డార్ఫర్‌లోని ఓ గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిందని, మృతుల్లో పురుషులు, మహిళలు, చిన్నారులు ఉన్నారని అబ్దెల్వాహిద్ మహ్మద్ నూర్ బృందం పేర్కొంది. కొండచరియల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసేందుకు సహాయం చేయాలని ఐక్యరాజ్యసమితిని, అంతర్జాతీయ సహాయ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఉత్తర డార్ఫర్‌లో సైన్యానికి, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఖీూఈ)కు మధ్య భీకర అంతర్యుద్ధం జరిగింతున్నది. దీంతో ప్రజలు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు మర్రా పర్వత ప్రాంతాలకు శరణార్థులుగా వలస వచ్చారు. ప్రకృతి విపత్తులో వారు మరణించడం గమనార్హం.

## దేశ అభివృద్ధి పథంలో బ్యాంకింగ్ రంగానిది కీలక పాత్ర: రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:తమిళనాడులోని చెన్నైలో జరిగిన సిటీ యూనియన్ బ్యాంక్ 120వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు నేడు(సెప్టెంబర్ 2, 2025) న రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, దేశ అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, వేగంగా మారుతున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజల ఆకాంక్షలు విస్తృతంగా పెరిగాయని పేర్కొన్నారు. బ్యాంకుల పాత్ర ఆర్థిక లావాదేవీలకు మించి విస్తరించిందని, నేడు బ్యాంకులు సంపదను రక్షించడమే కాకుండా.. అనేక రకాల ఆర్థిక సేవలను అందిస్తున్నాయని, ఇవి సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి కూడా దోహదపడుతున్నాయని తెలిపారు.

దేశ అభివృద్ధికి కీలకమైన స్థంభాలలో ‘ఆర్థిక సార్వజనీనత’ ఒకటని, ప్రతి పౌరుడు సరసమైన ధరలో ఆర్థిక సేవలను పొందేలా చూసుకోవాలని, బ్యాంకింగ్ పరిశ్రమ ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించడంలో సిటీ యూనియన్ బ్యాంక్ వంటి బ్యాంకులు సహాయపడుతున్నాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే చాలా మంది ప్రజలు ఇప్పటికీ బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. అయితే అందరికీ ఆర్థిక సేవలను అందించడంలో సిటీ యూనియన్ బ్యాంక్ అద్భుతమైన పురోగతి సాధించిందని రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు.

బ్యాంకులు, ఫిన్ టెక్ సంస్థలు వినియోగదారులకు అనుకూలమైన మొబైల్ యాప్‌లు, సూక్ష్మ రుణాలు, బీమా ఉత్పత్తులను పేదల పేద వర్గాల కోసం అందిస్తున్నాయని రాష్ట్రపతి, చెల్లింపు బ్యాంకులు, డిజిటల్ వాలెట్లు, బ్యాంకింగ్ కరస్పాండెంట్లు మారుమూల గ్రామాల ప్రజల ఇంటి ముందుకు ఆర్థిక సేవలను తీసుకెళ్తున్నాయని తెలిపారు. ఈ రంగంలో పురోగతి ఉన్నప్పటికీ, డిజిటల్ అక్షరాస్యత, ఇంటర్నెట్ సౌలభ్యం, ఆర్థిక అవగాహన వంటి అంశాల్లో ఇప్పటికీ అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయని ఆమె పేర్కొన్నారు. వీటిని అధిగమించేందుకు ప్రతి భాగస్వామి సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సాంకేతికత, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత ద్వారా ప్రజలను బ్యాంకింగ్ సేవలతో మరింతగా అనుసంధానించవచ్చని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు.

రైతుల సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి మన బ్యాంకింగ్ రంగం ప్రాధాన్య లక్ష్యాలుగా ఉండాలని, సకాలంలో రుణాన్ని అందించడం, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, వ్యవసాయ-సాంకేతిక కార్యక్రమాలను ప్రోత్సహిండం ద్వారా సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో బ్యాంకులు సహాయపడతాయని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలను అభివృద్ధి ఇంజిన్ లుగా మార్చడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించగలవని, వెనుకబడిన, అణగారిన వర్గాలకు సహాయం చేసేందుకు మన బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దినసరి కూలీలు, వలస కార్మికులను బ్యాంకింగ్ సేవలతో అనుసంధానించడానికి ప్రత్యేక కృషి అవసరమని ఆమె పేర్కొన్నారు.

మన ఆర్థికవ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ.. డిజిటల్ మార్పు, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో బ్యాంకుల పాత్ర మరింత కీలకంగా మారుతోందని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము తెలిపారు. స్టార్టప్‌ల నుంచి స్మార్ట్ సిటీల వరకు బ్యాంకులు సహాయం చేయగల రంగాలు అనేకం ఉన్నాయని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ను తీర్చిదిద్దడంలో బ్యాంకులు క్రియాశీల భాగస్వాములుగా మారాలని ఆమె తెలిపారు.

## వరద బాధితులకు ఎంఐఎం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

రెంజల్ సెప్టెంబర్ 02 : నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని కందకుర్తి పేపర్ మిల్, బోధన్ మండలం హంగిర్గా గ్రామాల పేద ప్రజలు వరద నీట మునిగి నిరాశ్రయులైన కుటుంబాలకు ఎంఐఎం పార్టీ తరఫున తమ వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యాన్ని అందించారు.

తమ వంతు బాధ్యతగా తీసుకొని 300 మంది కుటుంబాలకు సరిపడా వంట సరుకులను అందిస్తున్నారు. ఎంఐఎం బోధన్ టౌన్ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ తన సొంత ఖర్చుతో వంట సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి హాజీ బిల్డర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమీా సాబ్, జమీయత్ ఉల్మా మండల అధ్యక్షుడు మీర్జా అఫ్జల్ బేగ్, ఎంఐఎం మండల కార్యకర్తలు షోయబ్ బేగ్, మోబిన్ ఖాన్, అసరార్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టొద్దు

### -తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ సెప్టెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టొద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. పీసీ ఘోష్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవొద్దు అని కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 7వ తేదీన ప్రధాన పిటిషన్ విచారణ ఉన్నందున దసరా సెలవుల అనంతరం తదుపరి విచారణ ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. అప్పటి వరకు కమిషన్ ఆధారంగా కేసీఆర్, హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవొద్దని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిన తెలంగాణ హైకోర్టు.

## తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, సెప్టెంబర్ 2:తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది.

ఆ తర్వాత ఒడిశా మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశాలున్నాయని పేర్కొం ది. మంగళవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, జయశంకర్, భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

బుధవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మల్కాజ్‌గిరి, ములుగు, నారాయణపేట, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది.

## కోదాడలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన

నల్గొండ, సెప్టెంబర్ 2: కోదాడ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.54.03 కోట్లతో రాజీవ్ నగర్ రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు, రూ.5.10 కోట్లతో నీటి పారుదల శాఖ సర్కిల్ ఆఫీస్ డివిజన్ 4 సమీకృత కార్యాలయం నూతన భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో 2.29 లక్షల ఎకరాలకు సాగునీరును పర్యవేక్షించే అధికారులకు కార్యాలయం నాలుగు అంతస్తులతో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించడం జరుగుతుందన్నారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు.



భవిష్యత్‌లో భారీ వరదలు వచ్చినా తట్టుకునేలా రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రూ.54.03 కోట్లతో నిర్మిస్తున్నామని, దీని ద్వారా అనంతగిరి మండలంలో గొండ్రియాల గ్రామంలో 609 ఎకరాలు, కొత్తగూడెంలో 190 ఎకరాలు, బొజ్జగూడంతండాలో 496 ఎకరాలు, శాంతినగర్ లో 585 ఎకరాలు, లకారంలో 231 ఎకరాలు, తిరువన్నారంలో 803 ఎకరాలు, మొగలాయి కోటలో 306 ఎకరాలు మొత్తం అనంతగిరి మండలంలో 3,219 ఎకరాలు అలాగే కోదాడ మండలంలోని 1,781 ఎకరాలు, చిమ్మిర్యాల గ్రామంలో 750 ఎకరాలు, తమ్మరబండపాలెం 550 ఎకరాలు, నల్లబండగూడెంలో 481 ఎకరాలు, మొత్తం దీని ద్వారా 2,138 రైతు కుటుంబాలకి చెందిన 5 వేల ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు, ఇరిగేషన్ సీఈ రమేశ్ బాబు, ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ వాజిద్ అలీ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్షణలో కొత్తగూడెం ఏరియాకు బహుమతుల పంట

ఖమ్మం, సెప్టెంబర్ 2: సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి దిశా నిర్దేశాలతో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో చేస్తున్నందుకుగాను బహుమతులను అందుకోవడం జరిగిందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 55వ రక్షణ పక్షోత్సవాల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన కొత్తగూడెం ఏరియాకు గత నెల 31న ఎంఎన్ఆర్ గార్డెన్స్ శ్రీరాంపూర్‌లో బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్, విశిష్ట అతిథిగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా హాజరయ్యా రయ్యారు.కొత్తగూడెం ఏరియాకు జె.వి.ఆర్. ఓసీ. ఎఎ కి ఉపరితల గనుల గ్రూప్-1 విభాగంలో మొదటి బహుమతి, కిష్టారం ఓసి కి ఉపరితల గనుల గ్రూప్-3 విభాగంలో ద్వితీయ బహుమతి అలాగే గ్రూప్-3 కాంట్రాక్ట్ వర్కర్స్ విభాగంలో మొదటి బహుమతి, అండర్ గ్రౌండ్ గ్రూప్-1 విభాగంలో పద్మావతి గని మైన్ కు ద్వితీయ బహుమతి, అలాగే మైనింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్స్ విభాగాల్లో కొత్తగూడెం ఏరియా ఎంవిటీసీకి ద్వితీయ బహుమతి లభించింది.

# యోగా ధ్యాన ప్రాణాయామాల్ని ప్రచారం చేస్తున్న సద్గురు జగ్గీ వాసుదేవ్

## (03 సెప్టెంబర్ "సద్గురు జగ్గీ వాసుదేవ్ జన్మదినం" సందర్భంగా)

భారతీయ మోక్షకామి, ప్రవచన కర్త, యోగి, ఆధ్యాత్మిక సద్గురు జగ్గీ వాసుదేవ్ చొరవతో లాభాపేక్ష లేని సంస్థ "ఈషా ఫౌండేషన్"ను స్థాపించి ఇండియా, అమెరికా, యూకె, లెబనాన్, సింగపూర్, ఉగాండా, ఆస్ట్రేలియా లాంటి పలు దేశాలకు విస్తరించి యోగాతో పాటు పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. హిందూ సమాజానికి కాకుండా అన్ని మతస్థులకు అనుకూలంగా ప్రపంచ మానవాళికి జగ్గీ వాసుదేవ్ చేస్తున్న అమూల్య సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2017లో పద్మ భూషన్ పురస్కారాన్ని పొందడం, ఐరాస సామాజిక, ఆర్థిక సంస్థకు సలహాదారుగా నియమించబడ్డారు.

### జగదీష్ వాసుదేవ్ బాల్యం :

03 సెప్టెంబర్ 1957 రోజుల కర్నాటక రాష్ట్ర మైసూర్‌లో తెలుగు కుటుంబానికి చెందిన సుశీల–డా: వాసుదేవ్ దంపతులకు నాలుగవ, చివరి సంతానంగా జన్మించారు జగదీష్ వాసుదేవ్. తండ్రి రైల్వేశాఖలో నేత్ర వైద్యులుగా పనిచేయడం వల్ల పలు చోట్లకు బదిలీ కావడం జరిగేది. జగ్గీ అనే ముద్దు పేరుతో పిలువబడే జగదీష్ చిన్నపాటి నుంచే ప్రకృతిని ప్రేమిస్తూ, తరుచుగా అడవులను వెళ్లి ఆనందంగా గడిపే వారు. తన 11వ ఏట మల్లాడి హళ్ళి శ్రీ రాఘవేంద్ర స్వామి పరిచయంతో యోగాసనాలు నేర్చుకొని నిత్యం యోగసాధన చేస్తూ లోతైన అనుభవాలను గడించారు. పాఠశాల విద్య అనంతరం మైసూర్ యూనివర్సిటీలో బి.ఎ. ఇంగ్లీష్ పట్టా పొందారు. జగ్గీ వాసుదేవ్‌కు మోటార్లు సైకిల్‌పై షికారుకి వెళ్లడం ఇష్టంగా ఉండేది. కాలేజి చదువుల అనంతరం ఫౌల్ట్రీ, ఇటుక తయారీ, భవన నిర్మాణ రంగాల్లో లాభదాయక వ్యాపారం చేశారు.

### ఈషా యోగా సెంటర్ నిర్వహణ:

తన 25న ఏట మధ్యాహ్నం మోటార్లు సైకిల్‌పై చాముండి కొండపైకి వెళ్ళి ఒక రాయిపై కూర్చొని నాలుగున్నర గంటల పాటు అపూర్వ ఆధ్యాత్మిక అనుభవం పొంది నేను, రాయి, చెట్టు, ప్రకృతి అంతా ఒక్కటే అంటూ ఒక్కటే అనే అనుభవానికి వచ్చారు. తన వ్యాపారాన్ని మిత్రులకు అప్పగించి ఆధ్యాత్మిక అనుభవ అంతరార్థాన్ని అవగతం చేసుకోవడానికి పలు చోట్ల తిరుగుతూ ధ్యానం, యోగాలను బోధించడానికి నిశ్చయించారు. 1983లో మైసూర్‌లో ఏడుగురితో ప్రారంభమా యోగా తరగతులు క్రమంగా పలు నగరాలకు, ప్రాంతాలకు, దేశాలకు విస్తరించడం విశేషం. 1989లో కోయంబత్తూర్‌లో యోగా శిబిరం ప్రారంభించి "ఈషా యోగ సెంటర్" ప్రారంభించి ప్రాణాయామం, యోగాసనాలు, ధ్యానం బోధించడం నిత్యకృత్యం చేసుకున్నారు. 1993లో తన శిష్యుల సహాయంతో ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. 1994లో కోయంబత్తూర్‌కు 40 కిమీ దూరంలో వెళ్ళంగిరి పర్వత పాదాల చెంత 13 ఏరకాల భూమిని కొనుగోలు చేసి "ఈషా యోగా సెంటర్"ను ఏర్పాటు చేశారు.

ఈషా ఫౌండేషన్ స్థాపన, విస్తరణ:

'ఈషా' అనే సంస్కృతి పదానికి పాలకురాలు, యజమాని, ప్రభువు, రక్షించేది, నిరాకార దైవం, దివ్యత్వం లాంటి పలు అర్థాలు ఉన్నాయి. 1994లో ప్రారంభమైన ఈషా యోగా సెంటర్‌లో యోగా తరగతులు ప్రారంభం అయ్యాయి. 1999లో ధ్యాన లింగాన్ని ప్రతిష్టించడంతో ఆ ప్రాంగణాన్ని ప్రజల సందర్శనార్థం తెరువబడింది. ఏ మతానికి, విశ్వాసానికి చెందని ధ్యానలింగ యోగాలయం నేడు ధ్యానానికి మాత్రమే కేంద్రంగా నిలుస్తున్నది. ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన సర్వధర్మ స్తంభం అన్ని మతాల ఏకత్వాన్ని చాటుతూ అందరినీ ఆకర్షిస్తున్నది. సద్గురు జగ్గీ వాసుదేవ్ మతాతీత, లాభాపేక్షలేని స్వచ్ఛంద కార్యకర్తలతో నిర్వహింపబడే "ఈషా ఫౌండేషన్"ను స్థాపించారు.

ఆశ్రమంలో సద్గురు యోగా తరగతులు తీసుకోవడంతో ప్రారంభమైన "ఇన్నర్ ఇంజనీరింగ్" బోధనలు నేడు విశ్వవ్యాప్తం చేయడంలో విజయవంతం అయ్యారు. వివిధ పట్టణాల్లోన కాకుండా విదేశాల్లో సహితం సత్సంగాలు నిర్వహిస్తూ, ఈషా ఫౌండేషన్ సంస్థ కేంద్రాలను ప్రారంభిస్తూ, ప్రతి ఏట మానస సరోవర్ యాత్రలను భక్తులతో పాటు నిర్వహిస్తూ ప్రజల్లో ధార్మిక భావాలను చిగిరింపజేస్తున్నారు. ఐరాస నిర్వహించే ప్రపంచ శాంతి సమావేశాల్లో పలుమార్లా ప్రసంగించారు.

### సామాజిక చైతన్య కార్యక్రమాలు:

సామాజిక చైతన్యానికి కంకణబద్ధులైన జగ్గీ వాసుదేవ్ చొరవతో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన "ప్రాజెక్ట్ గ్రీన్ హాండ్స్' అనే హరిత రక్షణ ఉద్యమానికి పూనుకొని 20 లక్షల కార్యకర్తలతో 82 లక్షల మొక్కలు నాటించగలిగారు. గ్రామీణ పునరాభువృద్ధికి ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలను పెంచడానికి యోగా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం, సామూహిక క్రీడలు మొదలగు సామాజిక హిత కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం చేపట్టి 54,000 గ్రామాల్లో 7 కోట్ల ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. ఈషా ద్వారా గ్రామీణులకు విద్య బోధనలు కొనసాగించడానికి ఏడు పాఠశాలలు నిర్వహిస్తూ గ్రామీణ పేద యువతను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. వీరు నిర్వహించే పాఠశాలల్లో చదువుతో పాటు సంగీతం, కళలు, యోగా, వృత్తి విద్యలను కూడా సమాంతరంగా నేర్పిస్తున్నారు.

78 ఏండ్ల ఆధ్యాత్మిక సద్గురు జగ్గీ వాసుదేవ్ ఇటీవల అనారోగ్యం కారణంగా ఢిల్లీలో మెదడు శస్త్ర చికిత్సను చేయించుకున్నారు.

విజయకుమారిని వివాహమాడిన సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు ఒక కూతురు రాధే ఉన్నారు. తన అర్థాంగిని 1997లో కాలం చేయడం జరిగింది. పలు అంతర్జాత విశ్వవిద్యాలయాలు, ప్రఖ్యాత సంస్థల్లో అనేక ఉపన్యాసాలు ఇచ్చిన సద్గురు జగ్గీ స్థాపించిన ఈషా ఫౌండేషన్ వేదికగా 300లకు పైగా కేంద్రాల్లో 9 మిలియన్ల వాలంటీర్లతో యోగ, ధ్యానం, ప్రాణాయామం, ప్రజాహిత సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా నిర్వహిస్తున్నారు. ఒక సాధారణ వ్యక్తి తన నాలుగు దశాబ్దాల కాలంలో అసాధారణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, విద్య బోధన, ఆర్థికాభివృద్ధి, విశ్వ శాంతి స్థాపన యజ్ఞాలను కొనసాగిస్తూ, ప్రజలను ప్రభావితం చేస్తున్న సద్గురు జగ్గీ వాసుదేవ్ నిండు నూరేళు సఫల జీవితం కొనసాగించాలని కోరుకుందాం, ఆయన ఆయురారోగ్యాలకు ప్రార్థనలు చేద్దాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రైల్వే ఉద్యోగులకు మెరుగైన బీమా ప్రయోజనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:దేశంలోని రెండు దిగ్గజ సంస్థలైన ఇండియన్ రైల్వేస్ (ఐఆర్)–స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య ఇవాళ కీలక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ మేరకు ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే నెట్‌వర్కులలో ఒకటైన 'ఐఆర్', దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు 'ఎస్‌బీఐ' ప్రతినిధులు ఈ 'ఎంఓయూ'పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే, సమాచార–ప్రసార, ఎలక్ట్రానిక్స్–సమాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్‌తోపాటు రైల్వే బోర్డు చైర్మన్ శ్రీ సతీష్ కుమార్, 'ఎస్‌బీఐ' చైర్మన్ శ్రీ సి.ఎస్. షెట్టి ప్రత్యేక ప్రముఖులుగా హాజరయ్యారు.

ఈ 'ఎంఓయూ' ప్రకారం, 'ఎస్‌బీఐ'లో జీతం ఖాతాలున్న రైల్వే ఉద్యోగులకు బీమా రక్షణ గణనీయంగా పెరుగుతుంది. ఈ మేరకు ప్రమాదవశాత్తూ మరణిస్తే, 'సీజీఈజీఐఎస్' కింద గ్రూప్ 'ఎ, బి, సి' తరగతుల ఉద్యోగులకు ప్రస్తుతం ?1.20 లక్షలు, ?60,000, ?30,000 వంతున లభించే బీమా ప్రయోజనం ?1 కోటికి పెరుగుతుంది.

దీంతోపాటు 'ఎస్‌బీఐ'లో కేవలం జీతం ఖాతా మాత్రమేగల రైల్వే ఉద్యోగులందరికీ ఇకపై ?10 లక్షల దాకా సహజ మరణంపైనా బీమా రక్షణ లభిస్తుంది. ఇందుకోసం వారు ఎలాంటి రుసుమూ చెల్లించనక్కర్లేదు. అలాగే ఎటువంటి వైద్య పరీక్షలు కూడా చేయించుకోవాల్సిన అవసరం ఉండదు.

రైల్వే ఉద్యోగులలో దాదాపు 7 లక్షల మంది 'ఎస్‌బీఐ'లో జీతం ఖాతాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం దిశగా ఒక కీలక ముందడుగు కాగలదు. అంతేకాకుండా 'ఐఆర్–ఎస్‌బీఐ' మధ్య సంరక్షణాత్మక, ససంఘటిత భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ అవగాహన ఒప్పందం కింద లభించే కొన్ని కీలక అనుబంధ బీమా రక్షణ ప్రయోజనాలు కూడా లభిస్తాయి: ఇందులో– ?1.60 కోట్ల విమాన ప్రమాద బీమా (మరణ), రూపే డెబిట్ కార్డుపై ?1.00 కోట్ల అదనం... అలాగే ?1 కోటి వ్యక్తిగత ప్రమాద (శాశ్వత సంపూర్ణ వైకల్యం) బీమా, శాశ్వత పాక్షిక వైఫల్యంపై ?80 లక్షల వరకు రక్షణ లభిస్తాయి.

రెండు దిగ్గజ సంస్థల మధ్య కుదిరిన ఈ ఒప్పందం సౌహార్ద సహితం ఉద్యోగి–కేంద్రకం కావడం విశేషం. రైల్వే కార్మికశక్తికి – ముఖ్యంగా గ్రూప్ 'సి' సహా ఇతర ముందు వరుస కేటగిరీల ఉద్యోగులకు దీనిద్వారా ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయి.

# పవన్ అడుగడుగునా సామాన్యుడి పక్షం..

అమరావతి, సెప్టెంబర్ 2: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ట్విట్టర్ వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పవన్ అడుగడుగునా సామాన్యుడి పక్షం.. అణువణువునా సామాజిక స్పృహ.. మాటల్లో పదును.. చేతల్లో చేవ.. జన సైన్యానికి ధైర్యం .. మాటకి కట్టుబడే తత్వం .. రాజకీయాల్లో విలువలకు పట్టం .. స్పందించే హృదయం .. అన్నీ కలిస్తే పవనిజం అని కొనియాడారు.

నమ్మే అభిమానుల, కార్యకర్తల, ప్రజల దీవెనలతో మీరు నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. మరెన్నో విజయ శిఖరాలను అందుకోవాలి. పాలనలో, రాష్ట్రాభివృద్ధిలో మీ సహకారం మరువలేనిది అని తెలియజేస్తూ.. పవన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు." అని సీఎం ఎక్స్ లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. పవన్ తో తమ స్నేహం ముందు సాగాలని కోరుకున్నట్లు చంద్రబాబు ఆకాంక్షించారు.

# నిమజ్జనం రూట్ పరిశీలించిన ఎస్పీ..



మక్తల్ , సెప్టెంబర్ 1: నిమజ్జనం సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మహబూబ్ నగర్ ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. ఈ రోజు మక్తల్ వచ్చిన ఆయన నిమజ్జనం రూట్ పరిశీలించారు.

తొలుత ఆజాద్ నగర్, యాదవ్ నగర్, గాంధీనగర్ ఏరియాలో ఏర్పాటు చేసిన గణపతులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గణేష్ మండప నిర్వాహకులకు భద్రతపరమైన సూచనలు చేశారు. డీజే లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రార్థన మందిరాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండగ రెండు ఒకేసారి రావడం వల్ల అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలని కోరారు.

ఎలాంటి సమస్య ఉన్న తక్షణమే సంబంధిత లోకల్ పోలీసులకు లేదా డయల్100 కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీతో పాటు సీఐ రామ్ లాల్, ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయాన్ని, సాంకేతిక మద్దతును అందించి, ప్రజల భద్రత, పునరావాసం, పునర్నిర్మాణానికి కృషి చేస్తోంది: శ్రీ అమిత్ షా



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:జమ్మూలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాలను కేంద్ర హోంశాఖ, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా పరిశీలించారు. ప్రకృతి విపత్తు కారణంగా జరిగిన నష్టాన్ని ఆయన సమీక్షించారు. జమ్మూ జిల్లా మంగు చక్ గ్రామంలో వరద ప్రభావితులైన ప్రజలను కేంద్రమంత్రి కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిక్రమ్ చౌక్ వద్దనున్న తావి బ్రిడ్జ్, శివాలయం, వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు.

జమ్మూలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి శ్రీ ఒమర్ అబ్దుల్లా, కేంద్రం, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇటీవల ఘటనల్లో జరిగిన ప్రాణ నష్టంపై కేంద్ర హోం మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాదంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితో మాట్లాడారనీ, ఈ క్లిష్ట సమయంలో సహాయం అందించేందుకు కేంద్రం అన్ని చర్యలూ చేపట్టిందని శ్రీ అమిత్ షా తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతం, అన్ని సంస్థలూ కలసి సమన్వయంతో పనిచేసి, జరగబోయే నష్టాన్ని గణనీయంగా తగ్గించామనీ, అనేక ప్రాణాలను రక్షించగలిగామనీ ఆయన పేర్కొన్నారు.

అన్ని ముందస్తు హెచ్చరిక యాప్‌లపై విశ్లేషణ చేయడం, వాటి ఖచ్చితత్వం, గ్రామీణ స్థాయిలో అవి ఎలా పనిచేస్తున్నదీ తెలుసుకోవడం అవసరమని శ్రీ అమిత్ షా అన్నారు. కీలకమైన విశ్లేషణతో మన వ్యవస్థలను మెరుగుపరచడం వల్ల ప్రాణనష్టం జరగకుండా చూడవచ్చని ఆయన సూచించారు. జీఎల్ఓఎఫ్ (గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్) ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై కూడా సమగ్ర సమీక్ష అవసరమని పేర్కొన్నారు.

మేఘ విస్ఫోటనాలకు దారి తీసే ధోరణులు, మేఘాల్లో తేమ శాతం మధ్య సంబంధాన్ని విశ్లేషించేందుకు వాతావరణ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కారణాలను గుర్తించి ముందస్తు హెచ్చరికల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమాచార విశ్లేషణ, కృత్రిమ మేధను ఉపయోగించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ దిశగాచర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైన అదనపు రేషన్‌ను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సమకూర్చాలని కూడా ఆయన సూచించారు. పరిస్థితిని 10 రోజుల్లోగా అంచనా వేసి, ఆ తర్వాత సాధారణ రేషన్ పంపిణీపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి అధునాతన సర్వే బృందాలు నష్టాన్ని అంచనా వేసి అవసరమైన సహాయాన్ని అందిస్తాయని శ్రీ అమిత్ షా తెలిపారు.. కేంద్ర హోం కార్యదర్శితో పాటు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన సంబంధిత విభాగాల సమావేశం 1, 2 రోజుల్లో జరుగుతుందని తెలిపారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వం నుంచి వచ్చిన బృందాలు నష్టాన్ని అంచనా వేసేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర హోం మంత్రి ఆదేశించారు. ఆరోగ్య, జలవనరుల శాఖలు నీటి సరఫరా, ఆరోగ్య సేవలపై ముందస్తుగా దృష్టి సారించాలన్నారు. సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు దళాలు, వైమానిక దళం నుంచి వైద్య విభాగాలు కూడా సాయాన్ని అందించాలని తెలిపారు.

జమ్మూ కాశ్మీర్ సాధారణంగానే ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రాంతం కావడంతో కేంద్ర వాటాగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కోసం రూ. 209 కోట్ల మొత్తాన్ని ఈ ప్రాంతానికి కేటాయించామని, వీటి ద్వారానే సహాయ చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర హోం మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పాలిత ప్రాంత విపత్తు నిర్వహణ సంస్థ సకాలంలో హెచ్చరికలు జారీ చేయడం వల్ల ప్రాణనష్టం గణనీయంగా తగ్గిందని కేంద్ర హోం మంత్రి అన్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, భద్రతా బలగాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విపత్తు ప్రతిస్పందన దళం ఇతర ప్రతిస్పందన బృందాలన్నీ అప్రమత్తంగా ఉన్నాయని, హెలికాప్టర్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ మోహరింపునకు సంబంధించి ముందుగానే అందరికి సమాచారం కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రజల ఆస్తులు దెబ్బతిన్నాయని, నష్టపోయిన ఇళ్లకు రాష్ట్ర విపత్తు స్పందన నిధి కింద చేయాల్సిన సహాయాన్ని అంచనా వేసి, వీలైనంత త్వరగా చెల్లిస్తామని శ్రీ అమిత్ షా వెల్లడించారు. అనేక రోడ్లు దెబ్బతినగా.. వాటి మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. చాలా రహదారులపై వాహన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయని, అవసరమైన చోట్ల సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో 80 శాతానికి పైగా విద్యుత్ సరఫరాని పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారని, ఆరోగ్య సేవలు సజావుగా కొనసాగుతున్నాయన్నారు. అత్యంత కీలక విభాగాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ, వాటి తాత్కాలిక పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. జరిగిన నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోందని, కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ క్లిష్ట సమయంలో స్పందించడంతోపాటు, అన్ని సంస్థలూ చేస్తున్న ప్రయత్నాలను కేంద్రమంత్రి ప్రశంసించారు. సహాయక చర్యలను జమ్మూ ప్రభుత్వం సమర్ధవంతంగా నిర్వహించిందని చెప్పారు.

# ఆదిలాబాద్‌లో తోపులాట

ఆదిలాబాద్, సెప్టెంబర్ 2: కాళేశ్వరం పై సీబీఐ విచారణ సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పై రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనీ కొమరం భీమ్ చౌక్ లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అక్కడి నుండి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాయి.

దీంతో పోలీసులకు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఆదిలాబాద్ లో బీఆర్ఎస్ ఆఫీసు గేటు ఎదుట రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

కాళ్ల బూట్లతో తొక్కుతూ కార్యకర్తలు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, అజయ్, సాజిదోద్దీన్, రాజన్న, జంగిలి ప్రశాంత్, దాసరి రమేష్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజవర్గంలో ఇన్ చార్జి బుక్య నాయక్ ఆధ్వర్యంలో బాదన్ కుర్తి గోదావరి వంతెనపై రాస్తారోకో చేపట్టారు.

కడెం, పెంబి, దస్తురాబాద్, ఖానాపూర్ మండలాల నుండి భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి చేతగాని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పై నిందలు మోపి రాజకీయంగా తమ పార్టీని దెబ్బతీసేందుకే కుట్రవన్నారని ఆరోపించారు. కాగా బోత్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపుమేరకు బోత్, నేరడిగొండ, ఇచ్చోడ, తలమడుగు, బజార్హత్నూర్ మండలాల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు.

# సీఏపీఎఫ్‌లకు సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:జమ్మూలో ఈ రోజు జరిగిన సమావేశంలో కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా జమ్మూకాశ్మీర్ భద్రతా పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, డైరెక్టర్ , జమ్మూకాశ్మీర్ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సీఏపీఎఫ్ విభాగాల అధిపతులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

జమ్మూకాశ్మీర్ భద్రతా పరిస్థితిని సమీక్షిస్తూ.. ఈ సంవత్సరం శ్రీ అమర్‌నాథ్‌జీ యాత్రను శాంతియుతంగా నిర్వహించడంలో కేంద్రపాలిత ప్రాంత పరిపాలన యంత్రాగం, భద్రతా సంస్థల కృషిని కేంద్ర హోంమంత్రి ప్రశంసించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించని విధానంతో ముందుకుసాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలన కోసం అన్ని భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉంటూ.. సమన్వయంతో పనిచేయాలని హోంమంత్రి శ్రీ అమిత్ షా ఆదేశించారు.

జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదల సమయంలో చేపట్టిన సహాయ, రక్షణ చర్యల్లో అనేక మంది ప్రాణాలను కాపాడడంలో భద్రతా దళాల పాత్రను శ్రీ అమిత్ షా ప్రశంసించారు. జమ్మూకాశ్మీర్‌లో ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో సీఏపీఎఫ్‌లకు పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# ఎకరాకు రూ.40వేలు ఇవ్వాలి..

బఇటీవల కురిసిన భారీ వర్షాలకుఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు , కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు లు పూర్తిగా నిడడంతో, అధికారులు దిగువ ప్రాంతానికి నీరు వదలడంతో గోదావరి ప్రవాహం ఎక్కువ కావడంతో దండేపల్లి మండలంలోని గుడిరేవు, లక్ష్మీ కాంతపూర్ గ్రామాలలో వరి పొలాలు, పత్తిచేలు పూర్తిగా నీటమునగడంతో మంగళవారం మంచిర్యాల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోని, ఎకరానికి 40,వేల నష్టపరిహారం అందించాలని ప్రభుతాన్ని కోరారు. అనంతరం నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కొరత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 10సంవత్సరాలు రైతులకు యూరియా తిప్పలు లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కలిసి రైతును మోసం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్పుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, సహకార సంఘం వైస్ చైర్మన్ అక్కల రవీందర్, నాయకులు రేణి శ్రీనివాస్, బొమ్మేన మహేష్, గుర్రాల నరేష్ ,రమణ, గోళ్ల రాజమల్లు, రమేష్, రుపేందర్, బచ్చల అంజన్న, చిట్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చైనాలోని టియాంజిన్ నగరంలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 25వ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:చైనాలోని టియాంజిన్ నగరంలో 2025 ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నిర్వహించిన 25వ శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సులో షాంఘై సహకార సంస్థ బలోపేతం, అంతర్జాతీయ పాలన సంస్కరణ, ఉగ్రవాద నిర్మూలన, శాంతి– భద్రత, ఆర్థిక సహకారం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాల ఋపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి.

సదస్సును ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, ఎస్‌సీఓ విధానాలను బలోపేతం చేయటానికి భారత్ తీసుకుంటున్న విధానాన్ని వివరిస్తూ, భద్రత, అనుసంధానం, అవకాశం అనే మూడు స్తంభాల ద్వారా భారతదేశం మరిన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. శాంతి, భద్రత, స్థిరత్వం అనేవి పురోగతికి, శ్రేయస్సుకు కీలకమని చెబుతూ, అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి సభ్య దేశాలు బలమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి నిధుల సమీకరణ, తీవ్రవాద ధోరణుల పై సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడి సమయంలో సభ్య దేశాలు చూపించిన బలమైన సంఘీభావానికి ధన్యవాదాలు తెలుపుతూ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, సరిహద్దుల ద్వారా ఉగ్రవాదాన్ని ప్రేరేపించి, ప్రోత్సహించే దేశాలను బాధ్యులను చేయాలని సభ్యదేశాలను కోరారు.

అభివృద్ధి, నమ్మకాన్ని పెంచడంలో అనుసంధానత కీలకమనీ, చాబహార్ పోర్టు, అంతర్జాతీయ ఉత్తర–దక్షిణ రవాణా కారిడార్ వంటి ప్రాజెక్టులకు భారత్ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, యువ సాధికారత, ఉమ్మడి వారసత్వం వంటి రంగాల్లోని అవకాశాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, వీటిని ఎస్‌సీఓ పరిధిలో కొనసాగించాలని, ప్రజల మధ్య సంబంధాలను, సాంస్కృతిక అవగాహనను పెంపొందించటానికి ఒక సివిలైజేషన్ డైలాగ్ ఫోరం( సంస్కృతుల సంభాషణ వేదిక) ప్రారంభించాలని ప్రధానమంత్రి ప్రతిపాదించారు.

సభ్య దేశాల సంస్కరణల ఆధారిత అజెండాకు ప్రధానమంత్రి మద్దతు తెలుపుతూ, సంఘటిత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ భద్రత వంటి సమస్యల పరిష్కారానికి కేంద్రాల ఏర్పాటును స్వాగతించారు. గ్రూపులోని ఐక్యరాజ్యసమితితో సహా వివిధ సంస్థల్లో కూడా ఈ విధమైన సంస్కరణ విధానమే ఉండాలని కోరారు.

# బీహార్‌లో రాజ్య జీవిక నిధి రుణ సహకార సంఘం లిమిటెడ్ ను ప్రారంభించనున్న పీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో మాధ్యమం ద్వారా బీహార్ రాజ్య జీవిక నిధి రుణ సహకార సంఘం లిమిటెడ్ ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆ సంస్థ బ్యాంకు ఖాతాకు రూ.105 కోట్లను కూడా బదిలీ చేస్తారు.

జీవికతో అనుబంధం ఉన్న సంఘ సభ్యులకు సులభంగా, తక్కువ వడ్డీ రేటుకు నిధులను అందించడం జీవిక నిధి స్థాపన ముఖ్య ఉద్దేశ్యం. జీవికలో నమోదు చేసుకున్న అన్ని క్లస్టర్–స్థాయి సమాఖ్యలు ఈ సొసైటీలో సభ్యులుగా ఉంటాయి. ఈ సంస్థ కార్యకలాపాల కోసం బీహార్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నిధులను సమకూరుస్తాయి.

గత కొన్నేళ్లుగా జీవిక స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళల్లో పరిశ్రమల ఏర్పాటులో వృద్ధి కనిపిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అనేక చిన్న సంస్థలు, ఉత్పత్తిదారుల కంపెనీలు నెలకొన్నాయి.

అయినప్పటికీ, మహిళా పారిశ్రామి కవేత్తలు తరచుగా 18%?24% అధిక వడ్డీ రేట్లను వసూలు చేసే సూక్ష్మ రుణ సంస్థలపై ఆధారపడవలసి వస్తోంది. ఎంఎఫ్ఐలపై ఆధారపడటాన్ని తగ్గించి, తక్కువ వడ్డీ రేట్లకు ఎక్కువ రుణాన్ని సకాలంలో అందించేందుకు జీవికా నిధిని ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థగా రూపొందించారు.

ఇది పూర్తిగా డిజిటల్ ఆధారిత వ్యవస్థ. దీనివల్ల జీవిక సభ్యులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు మరింత వేగంగా, పారదర్శకంగా బదిలీ అవుతాయి.

ఈ విధానాన్ని సులభతరం చేసేందుకు 12,000 మంది కమ్యూనిటీ కార్యకర్తలకు మినీ కంప్యూటర్ల (ట్యాబ్ లు)ను ఇవ్వనున్నారు.

ఈ కార్యక్రమం గ్రామీణ మహిళల్లో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి, సంఘ ఆధారిత వ్యాపారాల వృద్ధిని వేగవంతం చేసే అవకాశం ఉంది. బీహార్ వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది మహిళలు ఈ కార్యక్రమాన్ని వీక్షించనున్నారు.

# సెమికాన్ ఇండియాలో సెప్టెంబరు 3న సీఈవోల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొననున్న ప్రధాని

బభారత సెమికండక్టర్ వ్యవస్థకు ప్రేరణనిచ్చే లక్ష్యంతో రూపొందించిన 'సెమికాన్ ఇండియా – 2025'ను సెప్టెంబరు 2న ఉదయం 10 గంటలకు న్యూఢిల్లీలోని యశోభూమిలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. సెప్టెంబరు 3న ఉదయం 9:30 గంటల సమయంలో జరిగే సదస్సులో ప్రధానమంత్రి పాల్గొంటారు. సీఈవోల రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ ఆయన పాల్గొంటారు.

సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు జరిగే ఈ మూడు రోజుల సదస్సులో.. దేశంలో బలమైన, క్రియాశీల, సుస్థిర సెమికండక్టర్ అనుకూల వ్యవస్థను అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. సెమికాన్ ఇండియా కార్యక్రమ పురోగతి, సెమికండక్టర్ ఫ్యాబ్రికేషన్ – అధునాతన ప్యాకేజింగ్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల సంసిద్ధత, అధునాతన తయారీ, పరిశోధన – అభివృద్ధి, కృత్రిమ మేధలో ఆవిష్కరణలు, పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర స్థాయిలో విధానాల అమలు తదితర అంశాలపై ఇందులో సదస్సులుంటాయి. అంతేకాకుండా డిజైన్ ఆధారిత ప్రోత్సాహక (డీఎల్ఐ) పథకం కింద చేపట్టిన కార్యక్రమాలు, అంకుర సంస్థల అనుకూల వ్యవస్థ వృద్ధి, అంతర్జాతీయ సహకారం, భారత సెమికండక్టర్ రంగం కోసం భవిష్యత్ ప్రణాళికలపై ఈ కార్యక్రమంలో ప్రముఖంగా చర్చించనున్నారు.

20,750 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారిలో 48 దేశాలకు చెందిన 2,500కు పైగా ప్రతినిధులు, 50 మందికి పైగా అంతర్జాతీయ ప్రముఖులు సహా 150 మందికి పైగా వక్తలు, 350కి పైగా ఎగ్జిబిటర్లు ఉన్నారు. 6 దేశాల రౌండ్ టేబుల్ చర్చలు, దేశాల ప్రదర్శన వేదికలు, శ్రామిక శక్తిని మెరుగుదలతోపాటు అంకుర సంస్థల కోసం ప్రత్యేక వేదికలు కూడా ఇందులో ఉంటాయి.

సెమికండక్టర్ రంగంలో విశేషంగా పెరిగిన సాంకేతిక పురోగతి, అలాగే సెమికండక్టర్ వ్యవస్థను బలోపేతం చేసేలా వివిధ దేశాల విధానాలకు సంబంధించి.. అంతర్జాతీయ విస్తృతిని పెంచడం లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా సెమికాన్ సదస్సులు నిర్వహించారు. సెమికండక్టర్ రూపకల్పన, తయారీ, సాంకేతిక అభివృద్ధికి నిలయంగా భారత్‌ను నిలపాలన్న ప్రధానమంత్రి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేలా.. 2022లో బెంగళూరులో, 2023లో గాంధీనగర్‌లో, 2024లో గ్రేటర్ నోయిడాలో సదస్సులు నిర్వహించారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం దిగిపోవాలి : ఎస్ఎఫ్ఐ నాయకులు



హనుమకొండ, సెప్టెంబర్ 02 : విద్యారంగ సమస్యలను పరిష్కరించని తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం గద్దె దిగిపోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేసారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టర్ కార్యాలయంను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేసారు.

పోలీసులకు ఎస్ఎఫ్ఐ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్షిప్స్?, ఫీ జు రీయింబర్స్?మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేసారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, బిరెడ్డి, జస్వంత్, అనూష, జిల్లా సహాయ కార్యదర్శి పరిమళ, బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, చెన్నూరి సాయికుమార్, ఎండీ ఇస్మాయిల్, సన్ని, పవన్ కుమార్, అరుణ్ కుమార్, నిఖిల్, మహేష్, భాను, రవళి, అనూష, రాధిక, మమత, ప్రవళిక, సుమతి, సుమ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేగుబంధం కంటే పార్టీని నమ్ముకున్న కోట్లాది కార్యకర్తలకే కేసీఆర్ ప్రాధాన్యం ఇచ్చారు : సత్యవతి రాథోడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 2: పేగుబంధం కంటే పార్టీని నమ్ముకున్న కోట్లాది కార్యకర్తలకే కేసీఆర్ ప్రాధాన్యం ఇచ్చారు అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. కవిత సస్పెన్షన్‌పై తెలంగాణ భవన్‌లో మహిళా నాయకురాళ్లతో కలిసి సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కోట్ల మంది కలిసి నడిచారు. పార్టీకి జరుగుతున్న నష్టాన్ని నివారించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతినకూడదని ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. కన్నబిడ్డల కంటే పార్టీ ఎక్కువని.. ఈ నిర్ణయంతో కేసీఆర్ చాటిచెప్పారు. ముందే హెచ్చరించినా కవిత తన తీరు మార్చుకోనందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదనే సందేశాన్ని కేసీఆర్ ఇచ్చారు. కవిత మాటలు లక్షలాది బీఆర్ఎస్ కార్యకర్తలను బాధపెట్టాయి. పార్టీ పెట్టినప్పటి నుంచి కేసీఆర్‌కు కుడిభుజంగా హరీశ్‌రావు ఉన్నారు. కొన్నాళ్లు కేటీఆర్‌పై విమర్శలు చేశారు. ఇప్పుడు హరీశ్‌రావుపై విమర్శలు చేశారు అని సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు.

కవిత వెనుక ఎవరో ఉండి మాట్లాడిస్తున్నట్లు మాకు అనిపిస్తోంది. కవితకు మా నాయకుడు కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారు. ఒకసారి ఎంపీని చేశారు.. తర్వాత ఓడిపోయినా.. ఎమ్మెల్సీని చేశారు. కేసీఆర్ కుమార్తెగా కవితకు పార్టీలో గౌరవం దక్కింది. ఇవాళ అన్ని మర్చిపోయి పార్టీ గురించి చెడుగా మాట్లాడటం సరికాదు. పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత అని ఆమె అన్నారు. నువ్వుంటే ఎంత.. పోతే ఎంత అని కార్యకర్తలు అనుకుంటున్నారని సత్యవతి రాథోడ్ తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.

# ప్రజల దృష్టిని మరల్చేందుకే 'సీబీఐ' పేరుతో డ్రామా.. డీసీఎమ్మెస్ చైర్మన్ డా.శ్రీకాంత్ రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 2:కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ప్రజల దృష్టి మరల్చేందుకే కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కొత్త డ్రామలు అడుతున్నాడని డీసీఎమ్మెస్ చైర్మన్ డా. ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావ్‌లపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర హోం శాఖకు లేఖ రాయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ధర్మపురి మండల బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. అంబేద్కర్ చౌక్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి బీఆర్ఎస్ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా డీసీఎమ్మెస్ చైర్మన్ డా. ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలను అణిచివేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అడ్డుపెట్టుకొని తెలంగాణ నీటి హక్కులను పాతరేసేందుకు కాంగ్రెస్ పన్నిన పన్నాగమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ప్రజల దృష్టి మరల్చేందుకే కాళేశ్వరంపై సీబీఐ విచారణ పేరుతో రేవంత్ రెడ్డి కొత్త డ్రామాలు ఆడుతాన్నాడని ఆయన విమర్శించారు.

నిన్నటి దాకా సీబీఐని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి నేడు అదే సీబీఐతో కాళేశ్వరంపై విచారణ చేయించాలని ఆసెంబ్లీలో తీర్మాణించడాన్ని చూస్తే ఈ వ్యవహారం వెనుక కుట్ర దాగి ఉన్నదని అర్థమవుతుందని ఆయన అన్నారు. ఎటువంటి విచారణకైనా బీఆర్ఎస్ నాయకులు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ కుట్రలన్నింటినీ ప్రజలకు గమనిస్తున్నారనీ, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సంఘీ సత్యమ్మ, నాయకులు అయ్యోరీ రాజేష్ కుమార్, సాళ్ల భీమయ్య, చిలివేరి శ్యాంసుందర్, సంగి శేఖర్, మహిపాల్రెడ్డి, చీర్నేని నర్సయ్య, చుక్క రవి. కుక్కల గంగారెడ్డి, కాశెట్టి విజయ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం - మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, సెప్టెంబర్ 2: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేయడం సరైన నిర్ణయం అని మాజీ ప్రభుత్వ విప్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారైనా పార్టీ తీసుకునే చర్యలకు సిద్ధం కావాల్సిందేనని తెలిపారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.

# కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ నిప్పులా నిలబడతారు : పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్, సెప్టెంబర్ 2:కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోంది అని బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. పీసీ ఘోష్ కమిటీ ట్రాష్ కమిటీ అని బీఆర్ఎస్ నేతలు చెప్పిన మాటే నిజమైందని, న్యాయస్థానంలో న్యాయం గెలిచిందని ఆమె అన్నారు.

మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఘోష్ కమిటీ రిపోర్టును న్యాయస్థానమే తప్పుపట్టిందని, దీని ఆధారంగా కేసీఆర్‌పైన, హరీశ్ రావుపైన ఎటువంటి చర్యలు తీసుకోరాదని, ఈ రిపోర్టు సరిగా లేదని న్యాయస్థానమే చెప్పిందన్నారు. భవిష్యత్తులో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, సీబీఐకి నివేదించినా, ఎవరికి ఇచ్చినా కూడా, తెలంగాణ ప్రజలకోసం కాళేశ్వరం ప్రాజెక్టును ఒక యజ్ఞంలాగా కట్టిన కేసీఆర్ విజయంతో ముందుకు వస్తారని, కాంగ్రెస్ కుట్రలను ఛేధిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో చేతులు కలిపి, బనకచర్లకు నీటిని తరలించేం దుకు కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డను సాకుగా చూపెట్టి, తెలంగాణను ఎడారి చేయడానికి కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులూ ఉన్నాయని, వాటిని కేసీఆర్, హరీశ్ రావు ఘోష్ కమిటీ ముందు హాజరై చూపించి, తమ వాదనలు వినిపించారని గుర్తు చేశారు. ఘోష్ కమిటీ రిపోర్టు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలకు అనుగుణంగా ఉందే తప్ప, అందులో న్యాయం లేదని, ఇదే విషయాన్ని హైకోర్టు కూడా చెప్పిందని వివరిం చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వాటిని ఛేధించుకుని నిప్పులాగా వారిద్దరూ నిలబడతారని, తెలంగాణ ప్రజల్ని కాపాడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై మాట్లాడుతూఅంతర్గతంగా చర్చించాల్సిన విషయాలను, బహిరంగంగా లేఖ రూపంలో కేసీఆర్‌కు అందజేసిన ఎమ్మెల్సీ కవిత, అప్పటి నుంచి ఇప్పటి వరకూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఉన్నారని, క్రమశిక్షణ తప్పారని అన్నారు. అందుకే కేసీఆర్ తన బిడ్డ అని కూడా చూడకుండా పార్టీ క్రమశిక్షణ తప్పిన ఆమెను సస్పెండ్ చేశారని, దీనిని అందరం స్వాగతిస్తున్నామని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని కేసీఆర్ సందేశాన్ని పంపించారని అన్నారు. 25 సంవత్సరాలుగా పార్టీని ఏర్పాటు చేసి, పోరాటం చేసి, గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంచి, పార్టీ శ్రేణులందరినీ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్న కేసీఆర్ లక్ష్యాలను సాధించేందుకు అందరం అండగా నిలుస్తాం అని, పార్టీ పరంగా తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని స్పష్టం చేశారు.

# చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి.. సఫాయి కార్మికులతో బాబు నాయక్

రాయపోల్, సెప్టెంబర్ 2 : ప్రతీ ఒక్కరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాయపోల్ మండల ప్రత్యేక అధికారి బాబూనాయక్ అన్నారు. సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రాయపోల్, కొత్తపల్లిలో మంగళవారం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా బాబూనాయక్ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సఫాయి కార్మికులకు సూచించారు. రోడ్లపై, వీధుల్లో చెత్తను పారవేయవద్దని.. దాంతో దోమలు, ఈగలు వంటివి వ్యాపించి అంటు వ్యాధులు రావడానికి అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇంటి పరిసరప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు శివకుమార్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి సుడిగాలి పర్యటన



సంగారెడ్డి సెప్టెంబర్ 02(నేటి నిజం ప్రతినిధి) ప్రజా పాలనలో భాగంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆహార భద్రత రేషన్ కార్డుల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళ వారం నాడు నారాయణఖేడ్ మండలంలోని అనంతసాగర్ గ్రామపంచాయతీలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. దాదాపు 70 లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ జూకల్ నుండి బంద్రాంపల్లి వరకు రోడ్డు మంజూరు చేయిస్తానని రెండు వాగులకు వంతెన నిర్మాణాలు గాదిస్తానని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంటు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, అందరికీ రైతు బంధు ఇందిరమ్మ ఇండ్లు లాంటి పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభు త్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ కెసిఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పు భారం చేసినప్పటికీ రేవంత్ రెడ్డి అన్ని కష్టాల భారాన్ని భరిస్తూ ప్రజలకు ఇన్ని పథకాలు అందిస్తున్నారని అన్నారు .రాబోయే రోజులలో పార్టీలకు అతీతంగా అందరికీ అన్ని పథకాలను వర్తింపజేస్తా మన్నారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ ప్రజలు ఆదరిస్తే అనంతసాగర్ గ్రామానికి ఏది అడిగిన దాని పూర్తి అవసరాలను తీరుస్తానని హామీ ఇచ్చారు. అంతారం నుండి మియాపూర్ లోంక తాండ వరకు, నారాయణఖేడ్ జూకల్ నుండి బంద్రాన్ పల్లి వరకు వీటి రోడ్లు వేయిస్తానని చెప్పారు. అనంతరం నవ యువకుడు ఈర లోకేష్ రెడ్డి మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామ అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్ చౌహాన్ , శివారెడ్డి, అంజిరెడ్డి, మోహన్ రెడ్డి, హనుమంతు, అంజిరెడ్డి , సిద్ధారెడ్డి దేవదాస్ గ్రామ సెక్రెటరీ యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు గ్రామ పెద్దలు పార్టీ కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు తుది జాబితా విడుదల



నల్గొండ, సెప్టెంబర్ 1: కట్టంగూర్ మండలంలోని 22 గ్రామ పంచాయతీల తుది ఓటరు జాబితాను మంగళవారం ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు విడుదల చేసి నోటీసు బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని 206 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం ఓటర్లు 37,362 మంది ఉండగా అందులో పురుషులు 18,565, స్త్రీలు 18,797 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజీ స్వరూపారాణి, కార్యాలయ పర్యవేక్షకుడు చింతమల్ల చలపతి, సీనియర్ అసిస్టెంట్ సులోచన. కట్టంగూర్ పంచాయితీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): వే ములవాడ పట్టణంలోని తిప్పపూర్ వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథి గా హాజరై, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆఖరి శ్వాస వరకు ప్రజల సంక్షేమం కోసం పరితపించిన నాయకుడని,పేద ప్రజల ఆరాధ్య దైవం ,డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కొనియాడారు. అయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు.

# కేసీఆర్ పై బురదజల్లే ప్రయత్నం

## –మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి):కేసీఆర్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోం అని మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి బ్రిడ్జి పై కేసీఆర్ చిత్రపటం తో నిరసన తెలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిడ్ మానేరు జలాశయంలోని కాళేశ్వరం నీటితో కెసిఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టను దెబ్బతీసేలా వ్యాఖ్యానించడం సరైంది కాదని, ప్రాజెక్టులో లోపాలు ఉంటే మరమ్మతులు చేయాలి కానీ రాజకీయ లబ్ధి కోసం దానిని వాడుకోవడం సరైంది కాదని కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో పావని గౌడ్, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు, మాజీ వైస్ ఎంపిపి ఆర్ సి రావు తో పాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిన్‌పింగ్, పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ ని తీవ్రంగా తప్పుబట్టిన అమెరికా

న్యూ డిల్లీ సెప్టెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో మరోసారి భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్-రష్యా మధ్య వాణిజ్య సంబంధాలపై తీవ్ర విమర్శలు చేశారు. సాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ కావడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇద్దరు నియంతలతో మోదీ భేటీ సిగ్గు చేటు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నవర్రో మాట్లాడుతూ.. 'భారత ప్రధాని మోదీ.. పుతిన్, జిన్‌పింగ్‌లతో కలిసి ఉండటం సిగ్గుచేటు. ఆయన ఏమి ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. భారత్ కలిసి ఉండాల్సింది అమెరికాతో.. రష్యాతో కాదు' అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.బ్రాహ్మణులు లాభపడుతున్నారు..ఇండియా దిగుమతులపై 50 శాతం సుంకాన్ని విధిస్తున్న అంశంపై నవర్రో ఇటీవలే తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారత ప్రజలను వాడుకుని బ్రహ్మణులు లాభపడుతున్నారని, దీన్ని ఆపాలని ఆయన అన్నారు. రష్యాకు లాండ్రీగా ఇండియా మారినట్లు ఆయన ఆరోపించారు. అమెరికాకు పోటీగా వాణిజ్య అసమానతలను ఇండియా సృష్టిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్లే ఇండియాపై 50 శాతం టారిఫ్ వసూల్ చేస్తున్నట్లు నవర్రో పేర్కొన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్ అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది. ఆ పదం వాడుకపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

# విద్యార్థిని విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## –జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో వికాస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థులకు స్వాగతం చెప్పే కార్యక్రమానికి ఎస్పీ మహేష్ బి. గితే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నారని,చారవణిలో ఆకట్టుకునే ప్రకటనలు చూసి అత్యాశకు పోయి సైబర్ మోసగాల్లో వలలో చిక్కుకోవద్దన్నారు. విద్యార్థుల లో సైబర్ నెరలపై చైతన్యం తీసుకం వలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని విద్యాస ంస్థలలో సైబర్ వారియర్ల చేత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియను వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే 1930 కి కాల్ చేసి పిర్యాదు చేయాలని భయపడవద్దని తెలిపారు. విద్యార్థులకు లోన్ యాప్స్, షేర్ మార్కెట్, ఏపీకే ఫైల్స్, కొరియర్ ,క్రెడిట్ కార్డ్,మ్యాట్రిమోని,లాటరీ గిఫ్ట్,మల్టీ లెవల్ మార్కెటింగ్ ,క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, గిఫ్ట్ ఫ్రాడ్ సోషల్ మీడియా తదితర మోసలపై విద్యార్థులకు జిల్లా సైబర్ సెల్ టీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ తొలి దశలోనే కట్టడి చేయాలని,ర్యాగింగ్ కి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడికను గకనిస్తూ ఉండాలని తెలిపారు. కళాశాల ఆవరణలో సీనియర్స్-జూనియర్స్ అనే తేడాలు లేకుండా స్నేహపూర్వకంగా చదువు కొనసాగించాలని ర్యాగింగ్ కు దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని,గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని,గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ వారికి అందివ్వాలని తెలి పారు.

విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టు కుని, కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ కృష్ణ, సైబర్ సెల్ ఆర్.ఎస్.ఐ జునైద్, కళశాల ప్రిన్సి పాల్ జగన్, కళశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయకుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

## –బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకట స్వామి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 2:(నేటినిజం ప్రతినిధి): :వేములవాడ పట్టణంలో గణేష్ నగర్ కట్టకింద వినాయకుడిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకట్ స్వామి దర్శనం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ వరసిద్ధి వినాయకుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, సకాలంలో వర్షాలు పడాలని పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. అనంతరం సాగరం వెంకటస్వామిని బొందుల మహేష్, రామదీర్థపు వెంకన్న, దాడి మల్లేశం, సన్మానించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com


